ఉష్ణోగ్రత (అంచనా)

6-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	26
నరసరావుపేట	39	26
బాపట్ల	38	27
రెంటచింతల	40	26



కృష్ణా పశ్చిమ డెల్టాలో అధ్వానంగా మారిన కాల్వ కట్ట

కాల్వల నిర్వహణకు... కాసులు కావాలి!

- ఖరీఫ్-2025-26 సీజన్‌కు గడ్డు కాలం..
- మరమ్మతులకు కాల్వల ఎదురు చూపులు
- నీటితీరువా వసూలు కాక.. నిధులు లేక
- ప్రభుత్వం ఆదుకుంటేనే బాగయ్యేది
- రైతుల నుంచి పన్ను వసూలు రూ. 33 కోట్లే
- సాగర్ కుడి కాల్వల పరిధిలో 355 అత్యవసర పనుల గుర్తింపు
- గత ఐదేళ్లలో ఒక్క పనీ జరగక రైతుల అవస్థలు

ఖరీఫ్-2025-26 సీజన్‌కు రాష్ట్రంలోని కాల్వల మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అత్యవసర మరమ్మతుల కింద ఓఅండ్ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) నిధులు ఆయా డెల్టాలకు ఏటా మంజూరు చేయడం పరిపాటి. అయితే ఈసారి రైతుల నుంచి పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ నిధులకు ఇబ్బంది ఏర్పడింది. రాష్ట్రం మొత్తం మీద రూ. 142 కోట్ల విలువైన కాల్వల పనులు ప్రభుత్వం ఇచ్చే చల్లని కబురు కోసం ఎదురు చూస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్క కాల్వకూ గుప్పెడు మట్టి పోసిందిలేదు. గండ్లు పూడ్చింది లేదు. పూడిక తీసిన పాపాన పోలేదు. దీంతో ప్రస్తుతం చివరి భూములకు చుక్కనీరు అందడం గగనమైంది.

బాపట్ల, మే 5, (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల మరమ్మతులు చేసేందుకు సమయం ఆసన్నమయింది. సాధారణంగా ఏటా రైతులు చెల్లించే నీటి తీరువా నుంచి ఈ పనులకు నీటిపారుదల శాఖ నిధులు సమకూర్చుకుంటుంది. నీటి తీరువాలో 80 శాతం వాటాగా ఇరిగేషన్‌కే ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఈ ఏడాది పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్‌లో కేవలం రూ.33 కోట్లే వసూలవడం.. పనుల విషయంలో అయోమయానికి కారణమైంది. అయితే నీటిపారుదల శాఖ మాత్రం ఓఅండ్ఎం పనుల కోసం రూ.142 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. ఈ నెలలోనే ఈ ప్రతిపాదనలపై కడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం నిర్వహించడం, పనులను ఆమోదించడం జరిగిపోయాయి. అయితే నిధులే సమస్యగా ఉండటంతో నీటిపారుదల శాఖ దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసింది. అప్పటి నుంచి ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఇటు నీటిపారుదల శాఖ, సాగునీటి సంఘాల్లో, అటు రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది.

నిధుల కోసం ఎదురు చూపులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగునీటి సంఘాలను తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు పెట్టి సంఘాల కమిటీలను అధికారికంగా ఎన్నుకునేలా చేసింది. సంఘాలు అత్యవసర పనులు ఎక్కడెక్కడ.. ఏమేమి చేయాలనేది గుర్తించాయి. రాష్ట్రంలోని సాగునీటి కాల్వలు, డ్రెయిన్‌ల అత్యవసర మరమ్మతుల కోసం కృష్ణా డెల్టా పరిధిలో రూ.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపితే, మైనర్ ఇరిగేషన్(చెరువులు) కింద రూ.55 కోట్లు, సాగర్ ఆయకట్టు కింద రూ. 37 కోట్లు, నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మొత్తాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది.



గోవిందాపురం మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

మరో రెండు నెలలే సమయం..

ప్రస్తుతం కృష్ణా డెల్టాలో ప్రస్తుతం తాగు నీటి కోసం చెరువులు నింపుకునేందుకు కాల్వలకు నీటిని విడుదల చేశారు. నిన్నటితో వాటిని కూడా ఆపాల్సి ఉంటే, మరో రెండు రోజులు కాల్వల్లో నీరు ప్రవహించే పరిస్థితి ఉంది. నీటిని కట్టేసిన వెంటనే కాల్వల పనులు వేగవంతం చేస్తేనే సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే ఖరీఫ్ సీజన్ కోసం జూలై 10 నుంచి కాల్వలకు తిరిగి నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇక 2 నెలలు మాత్రమే సమయం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయగలిగితే గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వల కట్టల మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఐదేళ్లలో పంట పండడం గగనమైపోయిన చివరి భూముల రైతులు ఈసారయినా తిండిగింజలు పండించుకునేందుకు అవకాశం ఉంటుంది.

355 పనులకు.. రూ.19.28 కోట్ల ప్రతిపాదనలు

సాగర్ కుడి కాల్వ పరిధిలో వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను ఇరిగేషన్ శాఖ గుర్తించింది. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్ల అంచనా వ్యయం సిద్ధం చేశారు. ఈ నిధులతో కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపడుతారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనులకు రూ 2.17 కోట్లు, గురజాల నియోజకవర్గ పరిధిలో 31 పనులకు రూ 2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ 2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ 2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ 2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో 29 పనులకు రూ 1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులు రూ 1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు వ్యయం రూ.2.70 కోట్లు, దర్శి నియోజక వర్గంలో 5 పనులకు వ్యయం రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనాలు రూపొందించి, జలవనరుల శాఖ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.



నరసరావుపేట : షట్టరు లేని తూము

నీటి తీరువాపై నిర్లక్ష్యం..

సాగర్ కాల్వల్లో మరమ్మతులకు ఇవ్వాల్సిన నీటి తీరువా నిధులను దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. నీటి తీరువా వసూలు చేయడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులు ఏటా చెల్లించే నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు 5 శాతం, ఇతర కేటాయింపులు పోగా.. 80 శాతం నిధులను మైనర్, మేజర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగు నీటి సంఘాల వారీగా కేటాయించాల్సి ఉంది. ఇందులో 10 శాతం పరిపాలనకు. 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇంకా నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణలో కూడా చేతులెత్తేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 కోట్లు నుంచి రూ. 21 కోట్లు వస్తుందని అంచానా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాల్వల మరమ్మతులు ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా.. తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టమన్నాం..

డెల్టా పరిధిలో కాల్వలకు నీరు ఆపిన వెంటనే చేయాల్సిన అత్యవసర పనులు మొదలు పెట్టమని నీటి సంఘాలకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. టెండర్ల పనులను కూడా చేయమని చెప్పాం. ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతుల నిధులకు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాం. తప్పకుండా నిధులు మంజూరవుతాయి.. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- బానోతు రాంబాబు, సీఈ, నీటిపారుదల శాఖ, కృష్ణా డెల్టా విభాగం, విజయవాడ

వందే భారత్ హాల్ట్‌పై ఆశలు

- చీరాల రైల్వేకు ఆదాయం, ప్రజలకు ప్రయోజనం
- ఆదాయం అధికంగా ఉన్నా.. పట్టించుకోని రైల్వేశాఖ
- ప్రజాప్రతినిధులు ఒత్తిడి లేకపోవడమేనని విమర్శలు



వందే భారత్ ప్రారంభ సమయంలో చీరాల్లో ఆగినప్పుడు ఫొటోలు దిగుతున్న ప్రజలు (ఫైల్‌ఫొటో)

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను వేగంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో.. ప్రారంభించిన వందేభారత్ రైలు సేవలు చీరాలలో అందు బాటులో లేకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నాయకులు ప్రజాప్రతినిధులు కూడా దీనిపై దృష్టిసారించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నియోకవర్గంలో సుమారు 2 లక్షలు పైగా జనా భా ఉంది. ఇక్కడ అత్యంత పాచుర్యం పొందిన వస్త్ర, వాణిజ్య వ్యాపార సముదాయాలు కోకొల్లలు. అలాగే వేల సంఖ్యలో విద్యార్థులకు విద్యాబోధన అందజేస్తున్న ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. పర్యాటకానికి అతి థుల రాకతో నిత్యం రద్దీగానే ఉంటుంది. అలాగే ప్రైవేటు ఫ్యాక్టరీల్లో ఉపాధి పొందుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఈ విధంగా చూస్తుంటే చీరాల ఇతర ప్రాంతాలకంటే ఎందులోనూ తక్కువ కాదు. పేరుకు బాపట్ల జిల్లా అయినా కూడా చీరాలలోనే సౌకర్యాలు, వ్యాపారాలు అధికంగా ఉంటాయి. దీంతో చీరాల నుండి నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, చీరాలకు వచ్చే వారి సంఖ్య అధికమే. ఇక రైల్వేశాఖ ఆదాయం పరంగాను రాష్ట్ర స్థాయిలో చీరాల 30వ స్థానంలో నిలిచింది. ఈక్రమంలో చూసుకుంటే జిల్లాలోనే చీరా లకు ప్రత్యేక స్థానం ఉన్నట్లు చెప్పవచ్చు. ఈ విధంగా అన్ని రంగాల్లో ముందున్నచీరాలకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి కూడా రాకపోకలు ఉంటాయి.

హాల్టింగ్‌కు వినతి..

వందేభారత్ రైలకు చీరాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ లేదు. దీంతో చీరాలలో జరుగుతున్న వ్యాపారాలు దీంతో రైల్వేకు అందుతున్న ఆదాయంతో పాటు, కేంద్రానికి జీఎస్టీ రూపంలో జరుగుతున్న చెల్లింపుల వివరాలను రైల్వే అధికారులకు వ్యాపారులు అందజేశారు. హాల్టింగ్ ఏర్పాటు చేయాలని వినతులు అందజేశారు. అయినా ఇప్పటికీ దీనిపై రైల్వేశాఖ నుంచి కదలిక రాలేదు. ప్రజాప్రతినిధులు పట్టుబట్టకపోవడమే ఇందుకు కారణమంటూ చర్చలు సాగుతున్నాయి.

రైల్వేకు ఆదాయం



వందే భారత్ రైలు చీరాలలో ఆగడం వల్ల రైల్వేకు అధికంగా ఆదాయం సమకూరుతుంది. అలాగే ప్రజలకూ ప్రయోజనం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ సమయానికి ఎక్కువ విలువిస్తున్నారు. శరవేగంగా నడిచే వందే భారత్‌పై చీరాల ప్రజలు ఆశతో ఉన్నారు.

- గుర్రం రాఘవరావు, వస్త్రవ్యాపారి, చీరాల

వంతెన నిర్మాణానికి.. వీడిన గ్రహణం

- గుండ్లకమ్మ నదిపై నిలిచిన వంతెన నిర్మాణం
- మూడు జిల్లాల ప్రజల అవస్థలు
- వైసీపీ హయాంలో నిలిచిన నిధులు
- మంత్రి రవికుమార్ సమీక్షతో..ప్రారంభానికి కసరత్తు

అద్దంకి, మే 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ విధ్వంస పాలనతో అభివృద్ధికి దూరమైన పలు ప్రాజెక్టులు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. ఈ క్రమంలోనే బల్లికురవ మండలం వెలమవారిపాలెం, ముండ్లమూరు మండలం జమ్మలమడకల మధ్య గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మాణాన్ని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పెదజాగర్లమూడి - పూరిమెట్ల రోడ్డులో ఉన్న వంతెన నిర్మాణానికి సుమారు రూ.8 కోట్లు నిధులు మంజూరు చేయగా పక్షం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

మూడు జిల్లాలకు అనుసంధానంగా..

ఈ వంతెన నిర్మాణం అటు ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లా ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాంతం ఒకప్పుడు మార్టూరు నియోజకవర్గం పరిధిలో ఉంది. అప్పట్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం యద్దనపూడి, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు మండలాలలో ఉన్న అత్యధిక గ్రామా లను కలుపుతూ పెదజాగర్లమూడి - పూరిమెట్ల(పీపీ రోడ్డు) ను ఆర్అండ్‌బీ పరిధిలో చేర్చారు. అప్పటి నుండి విడతల వారీగా ఆయా ప్రాంతాల్లో తారు రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఈ రహదారిలో గుండ్లకమ్మ నదిపై వంతెన లేకపోవడంతో ఆయా మండలాల ప్రజలు.. అద్దంకి వచ్చే ఆయా మండలాల్లోని గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దర్శి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి గుంటూరు, విజయవాడ, అమరావతి చేరుకు నేందుకు దగ్గరి మార్గంగా ఈ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది.



గుండ్లకమ్మ నదిపై పనులు నిలిచిపోయిన బ్రిడ్జి

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినా, బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. నాలుగేళ్లగా నిర్మాణ పనులు ఎక్కడివక్కడే ఆగాయి. దీంతో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా, సాగర్ కాలువలలో నీటి ప్రవాహం ఉన్నా గుండ్లకమ్మ నదిలో నీటిప్రవాహం ఉంటోంది. దీంతో బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, బల్లికురవ, సం తమాగులూరు మండలాలు, పల్నా డు జిల్లాలోని వినుకొండ రూరల్, నూజెం డ్ల, ప్రకాశం జిల్లా పరిధిలోని ముండ్ల మూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే అటు అద్దంకి లేదా అటు వినుకొండ వైపు నుంచి ప్రయాణించాల్సి వస్తుంది.

పక్షం రోజుల్లో పనులు ప్రారంభించేలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అద్దంకి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల ఆర్అండ్‌బీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమయంలో గుండ్లకమ్మ నదిపై అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మరోపక్షం రోజులలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభింప చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

48 కేంద్రాల్లో.. క్వింటా కొనలేదు!

- దిగుబడులు లక్షల టన్నుల్లో..ఇప్పటికి వచ్చింది 958 టన్నులే
- ప్రహసనంగా మారిన పంటల మద్దతు ధర
- మూలాలపై దృష్టి పెట్టని మార్క్‌ఫెడ్
- ఇప్పటికే ప్రభుత్వంపై విమర్శలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా 62 కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచి ఇప్పటికే నెలన్నర దాటింది. పెసలు, కంది, మినుములు, శనగ, జొన్నలను మద్దతు ధరకు సేకరించడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ ప్రకటించింది. తెరిచిన కొనుగోలు కేంద్రాలే తక్కువగా ఉంటే వాటిల్లో 48 చోట్ల ఇప్పటి వరకు ఒక్క క్వింటా పంట కొనక పోవడం విస్తుగొలుపుతోంది. మద్దతు ధర కంటే బయటి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందా అంటే.. ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. దాదాపు అన్ని పంటల ధరలు ఎంఎస్‌పీ కన్నా బయట రూ.100 నుంచి రూ.400 వరకు తక్కువగానే ఉన్నాయి. అయినప్పటికీ రైతులు బహిరంగ మార్కెట్ వైపే మొగ్గు చూపు తున్నారు కానీ, కొనుగోలు కేం ద్రాల ముఖం చూడడానికి కూడా ఇష్టపడడం లేదు.

ప్రస్ఫుటంగా వైఫల్యాలు..

దిగుబడులు అన్నదాతలు చేతికొచ్చిన మూడు వారాల తర్వాత కానీ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు తెరవలేదు. ఆ తర్వాత కూడా మద్దతు ధర విషయంలో అన్న దాతలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యమే ప్రదర్శించింది. గత ప్రభుత్వంలో దాదాపు గా మార్క్‌ఫెడ్‌ను నిర్వీర్యం చేయడమే కాకుండా.. అరకొరగా కొనుగోళ్లు జరిపిన వాటి విషయంలో నగదు జమ నెలల తరబడి జాప్యం కావడం.. ఇంకా అన్నదాతలను వెంటాడుతోంది. దీంతో ధర తక్కువయినా బయటి మార్కెట్‌కే రైతాంగం జై కొడుతోంది. ప్రస్తుతం నగదు జమ విషయంలో 15 నుంచి 20 రోజుల సమయం తీసుకోవడంతో పాటు ఇతరత్రా నిబంధనలు కూడా కేంద్రాల వద్ద స్పందన లేకపోవడానికి కారణంగా కనబడుతోంది. దాదాపు రూ. 2 కోట్ల వరకు అన్నదాతలకు పెం డింగ్ ఉన్నట్లు సమాచారం. ఈ బాలారిష్టాలకు తోడు పెట్టుబడుల సమయంలో నగదు సమ కూర్చిన దళారులకు పంట అమ్మకాలపై ముం దస్తు అనధికారిక ఒప్పందాలు కూడా రైతులకు శాపంగా పరిణమిస్తున్నాయి. మొక్కుబడిగా కొను గోలు కేంద్రాలు తెరవడంతో సరిపెట్టిందే తప్ప.. మూలాలపై దృష్టి పెట్టి అన్నదాతలను కొనుగోలు కేంద్రాలను బాట పట్టించడంలో మార్క్‌ఫెడ్ విఫలమైంది. ఇదిలా ఉంటే మొక్కజొన్నను మద్దతు ధరకు సేకరించే విషయంలో ఇంకా మార్క్‌ఫెడ్ దోబూచులాడుతూనే ఉంది. దీంతో ఇప్పటికే 70 శాతం పంట దళారుల వద్దకు చేరిపోయింది.

మొత్తం తెరిచిన కొనుగోలు కేంద్రాలు 62




పర్చూరు: అడుసుమల్లిలో పెసల సేకరణ (ఫైల్)

సేకరణ తీసికట్టుగా!

- జిల్లాలో పెసలు దిగబడి 8,000 టన్నుల వరకు ఉంటుందని వ్యవసాయశాఖ లెక్కకట్టింది. ఎంఎస్‌పీ రూ.8,682గా ఉంటే బయటి మార్కెట్‌లో దక్కుతున్నది రూ.7,000కు అటుఇటుగా ఉంది. సేకరణ లక్ష్యం 3,500 టన్నులు ప్రభుత్వం ఇస్తే.. ఇప్పటికి వచ్చింది 869 టన్నులే.
- కంది జిల్లాలో పరిమితంగానే సాగవడంతో లక్ష్యం 190 టన్నులుగా నిర్ణయించగా, కొనుగోలు 69 టన్నులకే పరిమితమైంది. కంది మద్దతు ధర రూ.7,550 గా ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7,200గా ఉంది.
- మినుములు జిల్లాలో దిగుబడి 35,000 వేల టన్నులు లెక్కకట్టగా.. మార్క్‌ఫెడ్ సేక రణ మరీ తీసికట్టుగా 19 టన్నులకే పరిమిత మైంది. మద్దతు ధర రూ.7,400గా ఉంది.
- ఇక శనగ, జొన్న విషయంలో మార్క్‌ఫెడ్ ఇంతవరకు ఖాతానే తెరవలేదు. శనగ దిగుబడులు 45,000 టన్నుల వరకు ఉంటాయని వ్యవసాయశాఖ తేల్చింది. మార్క్‌ఫెడ్‌కు ఇచ్చిన లక్ష్యం 5 వేల టన్నులు కాగా, ఇప్పటికి క్వింటా కూడా కేంద్రాల వద్దకు రాలేదు.
- ఇక మొక్కజొన్న దాదాపు 23,500 హెక్టార్లలో సాగయింది. సేకరణకు సంబంధించి ఓ నిర్ణయానికి ప్రభుత్వం రాలేదు. మరో వైపు దిగుబడులలో 75 శాతం ఇప్పటికే దళారుల వద్దకు చేరినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి.

48 కేంద్రాల్లో ఖాతానే తెరవలేదు

పెసలుకు మొత్తం 15 కేంద్రాలను తెరిస్తే 9 కేంద్రాల్లో 1,087 మంది రైతులు రిజిష్టర్ చేయించుకున్నారు. 571 మంది పంటను ఎంఎస్‌పీకి విక్రయించుకున్నారు. కంది కొనుగోలు కేంద్రాలు ఆరు కాగా నాలుగు చోట్ల 134 మంది రిజిష్టర్ చేసుకున్నారు. 64 మంది ఎంఎస్‌పీ లబ్ధి పొందగలిగారు. మినుములుకు 15 కేంద్రాలను తెరవగా ఒక్క చోట మాత్రమే 80 మంది రైతులు రిజిష్టర్ చేసుకున్నారు. 16 మంది తమ పంటను మద్దతు ధరకు అమ్ముకున్నారు. శనగకు 16 కేంద్రాలు తెరిస్తే ఇప్పటి వరకు జీరో ప్రొక్యూర్‌మెంట్ జరిగింది. అదే విధంగా జొన్న విషయంలో కూడా 10 కేంద్రాలను తెరిస్తే స్పందన్ నిల్‌గా ఉంది.



ఉబ్బసం నుంచి ఉపశమనం

కీలెంచి వాత పెట్టాలనే సూత్రం ఉబ్బసానికి కూడా వర్తిస్తుంది. ఈ రుగ్మత ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స అందించడం సరి కాదు. ప్రేరేపించే అంశాలు, వయసు, తీవ్రతల ఆధారంగా తగిన చికిత్సా మార్గాన్ని ఎంచుకుంటే ఉబ్బసాన్ని అదుపు చేయడమే కాదు, దాన్నుంచి సమూలంగా విముక్తి పొందవచ్చు అంటున్నారు వైద్యులు.

ఉబ్బసాన్ని వ్యాధిగా పరిగణించకూడదు. దీన్నొక పరిస్థితిగానే భావించాలి. ఈ సమస్య చికిత్సకు లొంగడమే కాకుండా, సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకోగలిగితే దీన్నుంచి శాశ్వత విముక్తి కూడా పొందే వీలుంటుంది. నిజానికి ఉబ్బసం వ్యాధి, చికిత్స పట్ల ఉన్న అపోహలే వ్యాధి నియంత్రణకు అవరోధాలుగా మారుతున్నాయి. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల పట్ల అవగాహన లేకపోవడం వల్ల సమస్యను అదుపు చేయలేకపోతున్నాం. ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం, పక్కదారి పట్టించే లక్షణాలకు స్వీయ చికిత్సలను ఆశ్రయించడం... ఇలా ఈ వ్యాధిని చేతులారా పెంచి పోషించుకుంటున్నాం!

గ్లోబల్ ఇనీషియేటివ్ ఆస్తమా అనే లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ, ప్రతి ఏటా మే ఆరును ఆస్తమా దినంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతూ ఉంటుంది.

లెక్కలేనన్ని కారణాలు

ఉబ్బసానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్య ఎవరికైనా, ఎప్పుడైనా తలెత్తవచ్చు. సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. ఈ పరిస్థితికి ఇంకొన్ని కారణాలు ఏవంటే...

- వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు
- వాతావరణ కాలుష్యం వల్ల రావొచ్చు
- జీవనశైలి, ఆహారశైలి మార్పులు రావొచ్చు
- కృత్రిమ పదార్థ రంగులు, రసాయనాల వల్ల తలెత్తవచ్చు
- ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీల వల్ల రావొచ్చు
- కొందరు పుట్టుకతోనే రావొచ్చు
- మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు
- జన్యు ఉత్పరివర్తనల వల్ల రావొచ్చు
- బొద్దింకలు, పూలపుప్పొడి వల్ల తలెత్తవచ్చు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగల వల్ల రావొచ్చు

ఈ లక్షణాల మీద కన్నేసి...

దగ్గు, పిల్లికూతలు, ఆయాసం.. ఈ మూడు ఉబ్బసం ప్రధాన లక్షణాలు. కానీ ఇవే లక్షణాలు సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా కనిపిస్తాయి. కానీ అవి కొన్ని రోజులు వేధించి, తగ్గిపోతాయి. అలా కాకుండా పదే పదే అవే లక్షణాలు వేధిస్తూ ఉన్నా, ఒక రుతువులో మాత్రమే ఈ లక్షణాలు పెరుగుతున్నా ఉబ్బసంగా అనుమానించాలి. కొత్తగా బడికి వెళ్తున్న పిల్లల్లో ఇలాంటి లక్షణాలు ప్రతి నెలా కనిపించినప్పుడు, ఆ లక్షణాలను ప్రేరేపించే అంశాలు, కుటుంబ చరిత్ర, తీవ్రతల ఆధారంగా ఉబ్బసాన్ని నిర్థారించుకోవాలి. అయితే రుతుపరమైన వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ఉబ్బసాన్ని నిర్థారించుకోవడం కోసం కొన్ని పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. పెద్దల్లో కూడా అకస్మాత్తుగా ఉబ్బసం తలెత్తుతుంది.

పరీక్షలున్నాయి

ఉబ్బసాన్ని నిర్థారించడం తేలికే! స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మెషిన్ పరీక్షలతో ఉబ్బసం తీవ్రత తెలుస్తుంది. మందులతో ఉబ్బసం లక్షణాలు అదుపులోకి రావడాన్ని బట్టి కూడా సమస్యను ఉబ్బసంగా నిర్థారించుకోవచ్చు. లక్షణాలు పగలు తక్కువగా సాయంత్రం, రాత్రి వేళ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఉబ్బసంగా నిర్థారించుకోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ పరీక్షలు కూడా అవసరమవుతాయి. అలాగే అలర్జీ సంకేతాలు, లక్షణాలకు సంబంధించిన ప్రశ్నావళులను పూరించడం ద్వారా, కలిగి ఉన్న అలర్జీల పట్ల స్పష్టత ఏర్పరుచుకుని, ఉబ్బసానికే దారి తీసే అవకాశాలను కూడా అంచనా వేయవచ్చు. వైద్యులు, ఈ పరీక్షలన్నిటినీ ఉబ్బసం నిర్వహణ సాధనాలుగా పరిగణిస్తారు. అలాగే కొందరు పిల్లల్లో వ్యాయామం చేసినప్పుడు మాత్రమే ఉబ్బసం ప్రేరేపితమవుతూ ఉంటుంది. ఇలాంటి పిల్లల చేత వ్యాయామం చేయించి, పల్మొనరీ ఫంక్షన్ టెస్ట్ చేపట్టి ఉబ్బసంగా నిర్థారించుకోవచ్చు.

ట్రిగ్గర్ కావొచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హేలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.



ఇన్‌హేలర్స్ సురక్షితం

ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హేలర్స్ సూచించినప్పుడు వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టిరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.

అలాగే కొందర్లో పిల్లికూతలు, ఆయాసం లేకుండా కేవలం దగ్గుతోనే ఉబ్బసం బయల్పడవచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో పిల్లికూతల రూపంలో ఉబ్బసం బయటపడొచ్చు.

అలర్జీలున్నాయా?

గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయినప్పుడు మన శరీరం వ్యాధినిరోధకశక్తి స్పందన తీరు మారిపోతుంది. ఫలితంగా కొన్ని వాతావరణాలకు, భావోద్వేగాలకూ, పదార్థాలకూ శరీరం ప్రతికూలంగా స్పందించి, ఉబ్బసం లక్షణాలు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా అలర్జీలన్నీ ఉబ్బసానికే దారి తీస్తాయని అనుకుంటూ ఉంటారు. కానీ ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్ లాంటి 40% నుంచి 50% అలర్జీలు మాత్రమే ఉబ్బసానికి దారి తీస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో అలర్జీలు ఉబ్బసాలకు దారి తీసే అవకాశాలు ఎక్కువ. కానీ ఎక్కువ శాతం పిల్లల్లో అలర్జీ కారక ఉబ్బసం ఉన్నప్పటికీ, సరైన చికిత్సను అందించగలిగితే, వయసు పెరిగేకొద్దీ ఆ లక్షణాలన్నీ సమసిపోతూ ఉంటాయి.

చికిత్స ఇలా...

అకస్మాత్తుగా తీవ్ర ఉబ్బసం దాడి చేసినప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఆ సమయంలో నెబ్యులేజేషన్‌తో పాటు ఆక్సిజన్ కూడా అవసరమవుతుంది. ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్ కూడా అవసరమవుతాయి. దీర్ఘకాల ఉబ్బసం ఉన్నవారు అలర్జీలను తగ్గించుకోవడం అవసరం. కొందరికి అగరబత్తీలు, సాంబ్రాణి వాసనలకు ఉబ్బసం లక్షణాలు వేధిస్తాయి. వీళ్లు మాస్కులు వాడుకోవాలి. స్వీట్లు తిన్నప్పుడు లక్షణాలు తీవ్రమైతే వాటికి దూరంగా ఉండాలి. చల్లని పదార్థాలు, కొన్ని రకాల పండ్లు, వంకాయ, గుడ్లు, నట్స్‌తో కూడా కొందర్లో ఉబ్బసం తలెత్తుతుంది. ఆ కారకాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ కూడా సర్వత్రా నాటుకుపోయింది. వీటిని ఉబ్బసం చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

డాక్టర్ పి. నవీన్ సారథి
కన్సల్టెంట్ పీడియాట్రిక్ పల్మొనాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



పారాహుషార్

300 గ్రాములు మించితే..

మాంసాహారుల్లో చికెన్‌ను ఇష్టపడని వారు ఉండరు. కొందరికైతే ఆదివారం వచ్చిందంటే చికెన్ లేనిదే ముద్ద దిగదు. అయితే చికెన్ తినడం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం. వయసు, ఆరోగ్యం, వైద్య చరిత్ర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, 19 ఏళ్ల పాటు, నాలుగు వేల మందిపై ఇటలీ పరిశోధకులు చేసిన అధ్యయనంలో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వారానికి 300 గ్రాముల కోళ్ల ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణశయాంతర క్యాన్సర్ ముప్పు రెండింతలు ఎక్కువవుతుందని న్యూట్రియంట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రమాదం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువని పరిశోధకులు తేల్చారు. అలాగే వారానికి 300 గ్రాములు, అంతకంటే ఎక్కువగా కోళ్ల ఉత్పత్తులు తినే వారిలో మరణాల ముప్పు కూడా 27 శాతం అధికమని గుర్తించారు. చికెన్‌లో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్ బీ12, కోలిన్ వంటివి పుష్కలంగా ఉన్నప్పటికీ, చికెన్‌ను వారానికి 100 గ్రాములకు మించకుండా మితంగా తినడం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.



హెల్త్ న్యూస్

టైప్5 మధుమేహం గురించి విన్నారా?

రక్తంలో ఇన్సులిన్ మోతాదు పెరిగితే, దాన్ని టైప్2 మధుమేహంగా నిర్థారిస్తారు. మరి ఇన్సులిన్ తగ్గితే? రక్తంలో సరిపడా ఇన్సులిన్ లేని పరిస్థితి, టైప్5 మధుమేహంగా అధికారిక గుర్తింపు పొందింది. మరిన్ని వివరాలు...

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాల క్రితమే పోషకాహార లోపంతో సంబంధమున్న మధుమేహాన్ని గుర్తించడం జరిగింది. ఈ రకమైన మధుమేహం తాజాగా అధికారిక గుర్తింపును దక్కించుకుంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్, ఈ మధుమేహాన్ని టైప్5 మధుమేహంగా వర్గీకరించింది. 70 ఏళ్ల క్రితమే ఈ మధుమేహాన్ని గుర్తించినప్పటికీ ప్రపంచ ఆరోగ్య చర్చల్లో దీన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 20వ శతాబ్దంలోనే వెలుగులోకొచ్చిన ఈ పరిస్థితిని టైప్1 లేదా టైప్2 మధుమేహంగా తప్పుగా వర్గీకరించారు. ఈ అసాధారణమైన మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లోని పోషకాహారలోపంతో బాధపడే యువతను పట్టి పీడిస్తున్నట్టు, 160 దేశాల్లోని 250 జాతీయ డయాబెటిక్ అసోసియేషన్లు అంచనా వేసినట్టు అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ పేర్కొంటోంది. దీర్ఘకాలం పాటు పోషకాహార లోపంతో బాధపడే వారిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్5 మధుమేహం పెరుగుతోంది. ప్రత్యేకించి కౌమార దశలో బయల్పడే ఈ మధుమేహానికి ఒక జన్యులోపమే కారణం. ఈ రకమైన జన్యు ఉత్పరివర్తనం తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. అయితే టైప్5 మధుమేహానికి ఇటీవలే అధికారిక గుర్తింపు లభించింది కాబట్టి వ్యాధినిర్థారణ, చికిత్సా విధానాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంబంధించి చేపట్టిన పరిశోధన ఆధారంగా ఈ రుగ్మతకు సంబంధించి మరో రెండేళ్లలో మార్గదర్శకాలను అభివృద్ధి చేయనున్నట్టు అంతర్జాతీయ మధుమేహ ఫెడరేషన్ ప్రకటించింది.





పెద్దపేగు పదిలంగా

మన దేశంలో అత్యంత సాధారణ క్యాన్సర్లలో పెద్ద పేగు క్యాన్సర్ ఒకటిగా మారిపోయింది. జీర్ణకోశ సమస్యలను తలపించే పెద్ద పేగు క్యాన్సర్ చికిత్స పక్కదారి పట్టే ప్రమాదం ఉంది కాబట్టి అప్రమత్తతతో వ్యవహరించడం అవసరమంటున్నారు వైద్యులు.

గత ఐదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ ఉదంతాలు రెట్టింపయ్యాయి. మునుపు ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైపోయిన ఈ క్యాన్సర్ తాజాగా మూడవ స్థానానికి ఎగబాకింది. ప్రత్యేకించి యువతలో ఈ క్యాన్సర్ పెరగడం ఆందోళన కలిగించే విషయం. మరీ ముఖ్యంగా ఈ క్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరి చికిత్స క్లిష్టమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం, పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు పొట్ట, పేగుల్లో తలెత్తే సాధారణ సమస్యలను తలపించేలా ఉండడమే!

తప్పుదోవ పట్టించే లక్షణాలు

మలబద్ధకం: రోజుల తరబడి మలబద్ధకం వేధిస్తుంది. అయితే అడపాదడపా ఈ సమస్య సాధారణమే కాబట్టి ఎవరూ దీన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ పెద్దపేగు క్యాన్సర్‌గా భావించరు

విరోచనాలు: ఈ లక్షణం కూడా అందర్లో అడపాదడపా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు

మిశ్రమ సమస్య: కొన్ని రోజులు మలబద్ధకం, ఇంకొన్ని రోజులు విరోచనాలు వేధిస్తాయి. ఇలాంటి మిశ్రమ లక్షణాలు కూడా పెద్దపేగు క్యాన్సర్‌ను సూచిస్తాయి

మలంలో రక్తం: మలంలో రక్తం కనిపించడం కూడా పెద్దపేగు క్యాన్సర్ లక్షణమే!

మలవిసర్జనలో ఇబ్బంది: మలవిసర్జన సాఫీగా, సునాయాసంగా జరగకపోయినా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

అల్సరేటివ్ కొలైటిస్: ఈ సమస్య నిర్లక్ష్యానికి గురైనప్పుడు, అది పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది

బరువు/ఆకలి తగ్గడం: అకారణంగా శరీర బరువు, ఆకలి తగ్గుతున్నా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

పెద్దపేగు ఆహారం

పెద్ద పేగు ఆరోగ్యం కోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు లాంటి జంక్ ఫుడ్ తగ్గించాలి.



నియంత్రణ చర్యలు ఇవే!

పెద్దపేగు క్యాన్సర్ నివారణ సులభమే! కొద్దిపాటి అప్రమత్తతతో, ముందు జాగ్రత్తలతో ఈ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

- బరువును అదుపులో ఉంచుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- వ్యాయామం చేస్తూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్ ఉన్నవాళ్లు 40 ఏళ్లు దాటిన వెంటనే, లేనివాళ్లు 50ఏళ్లు దాటగానే కొలనోస్కోపీ చేయించుకోవాలి
- ఒకసారి కొలనోస్కోపీలో క్యాన్సర్ లేదని నిర్థారణ అయినవాళ్లు అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకోవాలి
- రెడ్ మీట్, బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం మానేయాలి

వీరికి ముప్పు ఎక్కువ

- అధిక బరువు
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్
- అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు
- ఎక్కువగా రెడ్ మీట్ తినడం
- ధూమపానం, మద్యపానం
- వ్యాయామం లోపం
- ఎక్కువ గంటలు కదలకుండా పనిచేయడం
- బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం

వ్యాధి నిర్థారణ ఇలా...

మలబద్ధకమైనా, విరోచనాలు అయినా 5 నుంచి 7 రోజులకు క్రమేపీ సర్దుకుంటాయి. పొట్ట, పేగులకు సంబంధించిన సాధారణ సమస్యలన్నీ తాత్కాలికంగానే వేధించి, తగ్గిపోతూ ఉంటాయి. ఇలా కాకుండా నెల, రెండు నెలల పాటు లక్షణాలు వేధిస్తూ ఉన్నా, బరువు తగ్గిపోతున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి వ్యాధి నిర్థారణ పరీక్షలు చేయించుకోవాలి. రక్తపరీక్షలు, ట్యూమర్ మార్కర్లు, కొలనోస్కోపీలతో పెద్దపేగు క్యాన్సర్‌ను సులువుగా పసిగట్టవచ్చు. కొలనోస్కోపీతో ఒకటి, రెండు దశల్లోని కనిపెట్టవచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి సిటి స్కాన్, సిటి కొలనోగ్రఫీలు చేసి, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయవచ్చు. శరీరంలోకి ఎలాంటి స్కోప్‌ను చొప్పించకుండానే పెద్దపేగు, పురీషనాళంలోని పాలిప్స్, పుండ్లు, క్యాన్సర్ గడ్డలను కనిపెట్టడంలో సిటి కొలనోగ్రఫీ బాగా తోడ్పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్ ప్రారంభంలో చిన్న పాలిప్‌లా మొదలవుతుంది. కాబట్టి స్కాన్ సమయంలోనే వీటిని పసిగట్టి, తొలగించగలిగితే వ్యాధి ముదురకుండా చూసుకోవచ్చు.

చికిత్స సులువే!

పెద్దపేగుల్లో తలెత్తే క్యాన్సర్ ముందరి పాలిప్స్, కణుతులను ఎండోస్కోపీతో తొలగించుకోవచ్చు. ఈ చికిత్స రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. తర్వాతి రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. క్యాన్సర్ మూడు, నాల్గవ దశలకు చేరుకున్నప్పుడు సర్జరీ చేయక తప్పదు. చివరి దశల్లో క్యాన్సర్ పెద్దపేగు నుంచి కాలేయం, ఎముకలు, ఊపిరితిత్తులకు వ్యాపించినప్పుడు సర్జరీ ముందు, తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. తాజాగా రొబొటిక్ సర్జరీ కూడా అందుబాటులోకొచ్చింది. చిన్న కోతతో కొనసాగే ఈ సర్జరీతో రోగి తక్కువ కాలంలోనే కోలుకోగలుగుతాడు. సర్జరీ తదనంతరం దుష్ప్రభావాలు కూడా ఉండవు.

డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ భండారి
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



తెలుసుకుందాం

మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం....

రోజుకొక కొత్త విషయం: కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

బ్రెయిన్ గేమ్స్, పజిల్స్: సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

ధ్యానం: ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పొపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

వాటం మార్పు: కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేతినీ, ఎడమ చేతి వాటం ఉన్న వాళ్లు కుడి చేతినీ వాడుకుంటూ ఉండాలి. బ్రష్‌తో పళ్లు తోముకోడానికీ, చీపురు పట్టుకుని ఊడ్చడానికీ, ఏదైనా అందుకోడానికీ, గరిట తిప్పడానికీ.. ఇలా తేలికపాటి పనుల కోసం చేతి వాటం మారుస్తూ ఉండడం వల్ల మెదడులోని రెండు అర్థభాగాలూ చైతన్యమవుతాయి.

వ్యాయామం: వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్.. ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

అనుబంధాలు: సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



ఎస్ఆర్ఎంకు ఎక్సలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు



కేంద్రమంత్రి రాజ్‌భూషణ్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ వివేకానందన్

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి మరో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించింది. ఆసియా టుడే సంస్థ 15వ అంతర్జాతీయ విద్యా సదస్సును ఆదివారం సాయంత్రం న్యూఢిల్లీలో నిర్వహించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిశీలించి, బెస్ట్ ప్లేస్‌మెంట్ టైటిల్‌ను ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రకటించింది. గరిష్ఠంగా రూ.50 లక్షల వార్షిక వేతనంతో కూడిన ప్లేస్‌మెంట్ కైవసం చేసుకోవడమే కాకుండా వంద శాతం ప్లేస్‌మెంట్ రికార్డును వర్సిటీ సొంతం చేసుకుంది. సగటున రూ.9.38 లక్షల వార్షిక వేతనాలు విద్యార్థులకు లభించేలా శిక్షణ అందించింది. ఇంజనీరింగ్ విద్యార్థులకే కాకుండా బీకాం, బీబీఏ, ఎంబీఏ, ఎంటెక్ విద్యార్థులు సైతం సగటున రూ.31 లక్షల వార్షిక వేతనం కింద ఉద్యోగాలు సాధించారు. ఎస్ఆర్ఎం కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ వివేకానందన్.. కేంద్ర జలశక్తి మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి, ఫిజి రిపబ్లిక్ హైకమిషన్ కౌన్సిలర్ నీలేష్ రోనిల్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా వివేకానందను అభినందించారు.

ఒంగోలు జాతి పరిరక్షణకే బల ప్రదర్శన పోటీలు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు)మే 5 : ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకే జాతీయస్థాయి ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ వృషభ రాజాల బల ప్రదర్శన పోటీలు సోమవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. న్యూ కేటగిరి విభాగంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 13 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 1,400 కిలోల బండను లాగి హోరాహోరీగా తలపడ్డాయి. ఎడ్ల పందేల ప్రాంగణం జన జాతరను తలపించింది. 5వ రోజు ఎమ్మెల్యే



ఎడ్ల పెంపకం దార్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్రిస్టీనా తదితరులు

ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేసి, అనంతరం హెనీ క్రిస్టీనా మాట్లాడారు. రైతులను ప్రోత్సహించే విధంగా బల ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పరిక్షరక్షణకు ఈ పోటీలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. నేటి యువత ఒంగోలు జాతి ఎడ్ల విశిష్టతను గుర్తించి, ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సంగం పాలక వర్గ సభ్యులు, పలువరు ప్రముఖులు పోటీలను వీక్షించారు.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు

● 61వ రోజు వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి (ఉండవల్లి), మే 5, (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ సోమవారంతో 61వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసానికి తరలివచ్చారు. అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ వారి నుండి అర్జీలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పలు అర్జీలకు సంబంధించి అప్పటికప్పుడే పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ హయాంలో భూమి అన్యాక్రాంతం చేశారు

వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో తమ 34 సెంట్ల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తమకున్న ఏకైక ఆధారాన్ని రక్షించాలని కోరగా పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీలో తన భర్త పని చేస్తూ.. కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుని, సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శాఖపరమైన పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని తెలిపారు.బీఎస్సీ నర్సింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఒంగోలు పట్టణం, మామిడిపాలేనికి చెందిన మౌనిక మంత్రికి విజ్ఞప్తి చేసింది. పుట్టుకతోనే దివ్యాంగుడైన తన కుమారుడికి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పోరంకికి చెందిన ఐ.వరప్రసాద్ విన్నవించారు. గత వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లా కవులూరులో తనకు నివేశన స్థలం మంజూరు చేసి, ఇంటి పట్టా ఇచ్చారని, కానీ, ఈ రోజు వరకు స్థలాన్ని చూపించలేదని జక్కంపూడికి చెందిన అన్నమ రాజు ముత్యాలు అర్జీ సమర్పించారు. 2017-18లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థు లకు న్యాయం చేయాలని ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కడప, రేణిగుంట మధ్య జాతీయ రహదారి 716 విస్తరణలో భాగంగా తన ఇంటిని అధికారులు సేకరించారని, అయితే ఇంటి నిర్మాణానికి మా త్రమే నష్టరి హారం ఇచ్చి.. స్థలానికి ఇవ్వకుండా వైసీపీ హ యాంలోని భూ సేకరణ అధికారులు వేధిస్తు న్నారని తిరుపతి జిల్లా, కరకంబాడికి చెందిన సుబ్రహ్మణ్యం మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా అర్జీలు ఇచ్చేందుకు పలువురు దివ్యాంగులు రాగా లోకేశ్ స్వ యంగా వారి దగ్గరకే వెళ్లి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరించి మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

ఆరోగ్య శాఖలో కలకలం

జీవో నంబరు 143కు వ్యతిరేకంగా బదిలీలు

23 మందికి సమన్లు.. నేడు, రేపు విచారణ

గుంటూరు సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. గుంటూరు రీజినల్ డైరెక్టర్ పరిధి లోని 23 మంది ఉద్యోగులకు సమన్లు జారీ అయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఆర్డీ కార్యాలయంలో జరగనున్న విచారణకు హాజరు కావాలని అందులో పొందుపరిచారు. జీఓ నంబరు 143కి విరుద్ధంగా బదిలీలు, డిప్యూటేషన్లు జరిగినట్లు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్డీ కార్యాలయంలో కొందరు అధికారులు అక్రమ బదిలీలకు తెరలేపడం వివాదాస్పదమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నేతల పలుకుబడితో ఆయా పోస్టుల్లోకి వచ్చిన అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

అన్నీ ఆయనే..

సదరు జీఓ ప్రకారం ఒకే క్యాడర్ లో ఇద్దరు ఉద్యోగులు ఉంటేనే బదిలీ చేయాలి. ఆర్డీ కార్యాలయం అధికారులు ఆ నిబంధనను పక్కన పెట్టేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల వద్ద పెద్ద మొత్తంలో పుచ్చుకొని ఒకే క్యాడర్ కేవలం ఒక్కరు ఉన్నా కూడా తాత్కాలిక బదిలీ) చేశారు. ఆర్డీ కార్యాల యంలో ఉన్న అధికారిణిని పక్కన పెట్టేసి కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్య నేత కొడాలి నాని సిఫార్సుతో ఆర్డీ కార్యాలయంలో తిష్ట వేసిన అధికారి కనుసన్నల్లోనే ఇలాంటి అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా.. అదే అధికారి కార్యాలయంలో సర్వం తానై నడుపుతుండడంతో మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారు.

స్కార్పియో ఢీకొని.. ద్విచక్ర వాహనదారుడి మృతి

కర్లపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్కార్పియో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కర్లపాలెం మండలం యాజలి సెంటర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం పిట్లలవానిపాలెం మండలం అలకాపురానికి చెందిన కుసపూడి కృష్ణంరాజు (59) ద్విచక్ర వాహనంపై కర్లపాలెం వైపు వస్తున్నాడు. కర్లపాలెం వైపు నుంచి చందోలు వెళ్తున్న స్కార్పియో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవీంద్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కొడుకు నాగ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్కార్పియో వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ : కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు (విద్య) మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడా లన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 23,279 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది విద్యార్థులు హాజరు అవుతారని చెప్పారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాలకు పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేసి, ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, ఆర్ఐఓ జుబేర్, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్ఓ ఎన్.ఎస్.కే ఖాజావలి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


ఆదర్శ గ్రామాల ప్రకటనలో అలసత్వం

- చేస్తే 100 శాతం కేంద్రం నిధులు వచ్చే అవకాశం
- గ్రామాల అభివృద్ధి ప్రణాళికల ఆమోదం పెండింగ్
- సత్వరమే డీఎల్‌సీసీ మీటింగ్‌లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై) పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదర్శ గ్రామాల ప్రకటనలో జాప్యం జరుగుతోంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన గ్యాప్ ఫిల్లింగ్(జీఎఫ్) ఫండ్స్ రావడం లేదు. మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్(వీడీపీలు) సిద్ధమైనప్పటికీ వాటిని జిల్లా స్థాయి కన్వర్జన్స్ కమిటీ(డీఎల్‌సీసీ) ఆమోదించి ప్రకటించాల్సి ఉంది. కారణాలేమైనా.. సమావేశాలు సక్రమంగా జరగకపోతుండడంతో.. ఈ పథకం నుంచి ఎక్కువ మొత్తంలో గ్రామ పంచాయతీలకు నిధులు తెచ్చుకొనే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో తక్షణమే మూడు జిల్లాల కలెక్టర్లు కన్వర్జన్స్ కమిటీల మీటింగ్‌లు ఏర్పాటు చేసి, వీడీపీలు ఆమోదించి ఆదర్శ గ్రామాలను ప్రకటించాలని, తద్వారా అదనపు నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వీడీపీల ఆమోదం పెండింగ్..

తరతరాలుగా విద్య, సంపదలో వెనకబడిపోయిన ఎస్సీలను పైకి తీసుకురావడానికి పీఎంఏజీవై పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను వారికి వర్తింపజేయడంతో పాటు గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్స్‌ని విడుదల చేస్తుంది. ఒక్కో గ్రామానికి రూ. 20 లక్షల వరకు నిధులు తెచ్చుకొనే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటికీ ఎన్‌డీఏ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ స్కీమ్ కింద గుంటూరు జిల్లాలో 39 గ్రామాలను ఎంపిక చేయగా వీడీపీలను అన్నింటికి తయారు చేశారు. వీడీపీలు ఆమోదం విషయానికి వచ్చేసరికి 15 ఆమోదించి 24 పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఆదర్శ గ్రామాలను సంపూర్ణంగా ప్రకటించలేకపోయారు. ఇదేవిధంగా పల్నాడు జిల్లాలో 21 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను తయారు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎనిమిదింటిని మాత్రమే ప్రకటరించారు. 13 గ్రామాలను పెండింగ్‌లో పెట్టారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 58 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను 46 గ్రామాలకు సిద్ధం చేశారు. వాటిల్లో 15 మాత్రమే ఆమోదించి 43 పెండింగ్‌లో ఉంచారు. వీటిల్లో తొమ్మిది గ్రామాలను మాత్రమే ఆదర్శవంతమైనవిగా ప్రకటించారు.



పీఎంఏజీవై లోగో

118 గ్రామాలకు..రూ.23.60 కోట్లు

కాగా గుంటూరులో మూడు గ్రామాలకు సంబంధించి గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్ కింద రూ. 80 లక్షలు విడుదల కాగా ఇప్పటివరకు వాటిని ఖర్చు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో తక్షణమే జడ్పీ సీఈవో/పంచాయతీ రాజ్ ఈఈలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ని ప్రభుత్వం ఆదేశించింది. మూడు జిల్లాలు కలిపి 118 గ్రామాలను ఆదర్శంగా ప్రకటించుకోగలిగితే రూ.23.60 కోట్ల నిధులను కేంద్రం నుంచి తెచ్చుకొని గ్యాప్ ఫిల్లింగ్ వర్కులకు ఉపయోగించుకొనే అవకాశం ఉంటుంది. ఇందుకు కేంద్రం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు రూపొందించి జిల్లా స్థాయి కన్వర్జన్స్ మీటింగ్‌ల్లో ఆమోదం తీసుకొని ఆఖరుగా వాటిని ఆదర్శ గ్రామాలుగా ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించి నిధులు విడుదల చేయిస్తుంది.

పని ఒత్తిడి తట్టుకోలేక ఏఎన్ఎం ఆత్మహత్య



మల్లోలు కోటేశ్వరమ్మ(ఫైల్)

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నట్లు లేఖ రాసి పట్టణంలోని 5వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం మల్లోలు కోటేశ్వరమ్మ(27) ఆదివారం రాత్రి ఉరివేసుకుంది. సమాచారం మేరకు.. పట్టణ సీఐ మల్లికార్జున సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి, మీడియాకు వివరా లు వెల్లడించారు. లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన సింగోకు సుశీల, బుల్లికోటయ్య మూడో కుమర్తె కోటేశ్వరమ్మకు మూడేళ్ల క్రితం నిజాంపట్నం మండలం దిండి గ్రామానికి చెందిన మల్లోలు గోపితో వివాహం జరిగింది. భర్త గోపి నిజాంపట్నంలో ప్రయివేటు టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తలు 5వ వార్డులో నివాసం ఉంటున్నారు. కోటేశ్వరమ్మ స్థానిక సచివాలయంలోనే ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ లేఖ రాసి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సోమవారం తెల్లవారుజామున భర్త గోపి చూసేసరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ.. కనబడటంతో చుట్టుపక్కల వారిని పిలిచి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లికార్జునరావు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోటేశ్వరమ్మ తల్లి సింగోకు సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది.

ఏఎన్ఎంలు ధైర్యంగా ఉండాలి

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం కోటేశ్వరమ్మ పని ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. త్వరలోనే పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఏఎన్ఎంలు ధైర్యంగా ఉండాలని సూచించారు. అధికారులు మరీ తట్టుకోలేని ఒత్తిడి తెస్తే.. జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. కోటేశ్వరమ్మలా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు.. కోటేశ్వరమ్మ ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

● మహిళా కండక్టర్‌పై దాడి కేసులో రెండేళ్లు జైలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మామ హత్య కేసులో నిందితుడైన అల్లుడికి యావజ్జీవ కారాగార శిక్ష, అదేవిధంగా మహిళా కండక్టర్‌పై దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు, వెయ్యి జరిమాన విధిస్తూ సోమవారం ఆయా కోర్టులు తీర్పులిచ్చాయి. కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకుమానువారి వీధిలో ఓ మహిళ తన భర్త నుండి దూరంగా.. తన పుట్టింటిలో నివాసం ఉంటోంది. ఆమె భర్త కృష్ణాజిల్లా రామవరప్పాడుకు చెందిన కుర్రా శివ నాగభూషణం 2017 జులై 30న రాత్రి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఆమె తండ్రి అడ్డురాగా అతనికి తీవ్ర గా యాలయ్యాయి. అతన్ని హాస్పిటల్లో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణిం చాడు. సీఐ శ్రీకాంత్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ రెండవ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో ఏపీపీ బర్కత్ అలీ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి వై.నాగరాజు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో విధుల్లో ఉన్న మహిళా కండక్టర్‌ను దుర్భాషలాడి, దాడికి పాల్పడిన దండు రామనాథరెడ్డి అనే వ్యక్తి పై అప్పటి మేడికొండూరు ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. 5వ జేఎఫ్‌సీఎం న్యాయస్థానంలో జరిగిన విచారణలో నిందితుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి.. న్యాయమూర్తి కోలార్ లతా.. రామనాథరెడ్డికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

హత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడు అప్పారావును అరెస్టు చూపుతున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, పోలీసు కానిస్టేబుళ్లు

దాచేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త ఉల్లేరు అప్పారావును పొందుగుల బోర్డర్ చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు దాచేపల్లి సీఐ భాస్కరరావు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 1వ తేదీన ఉల్లేరు అప్పారావు భార్య దుర్గపై అనుమానంతో నడికుడి శివారులోని అంబుజా సిమెంట్స్ భూముల్లోకి తీసుకెళ్లి ఆమె తలపై కొట్టి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలపాలైన దుర్గ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ కేసులో నిందితుడు అప్పారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు.

బౌద్ధ స్థూపాన్ని పరిశీలించిన రేపల్లె ఆర్డీవో

భట్టిప్రోలు (కొల్లూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ స్థూపాన్ని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సందర్శించారు. భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, మే 12వ తేదీన బుద్ధ జయంతి వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలని ఇటీవల గ్రీవెన్స్‌లో దళిత బుద్ధిస్టులు కలెక్టర్ కె.వెంకటమురళీకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఆర్డీవో, జిల్లా పంచాయతీ అధికారి బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని సూచించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో అక్కడ చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. 12న బుద్ధ జయంతి నిర్వహించాలని బుద్ధిస్టులు కోరగా, కలెక్టర్‌తో చర్చించి వేడుకల నిర్వహణపై ప్రకటన చేస్తామని ఆర్డీవో అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్మయి, ఆది ఆంధ్ర నవ బుద్ధిస్టు సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది దోవ రమేష్ రాంజీ, టీడీపీ నాయకులు నీల జోగిబాబు, న్యాయవాది సాంబశివరావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.90 అడుగులు ఉంది. ఇది 138.38 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,33,870 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,38,347 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,870 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,723 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	10000	12400
341	10000	13300
4884	10000	11200
సూపర్10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13800
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12600
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

బాపట్ల వార్తలు

పిడుగుపాటుతో జిల్లాలో ఇద్దరు మృతి

● ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళిన కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షం కారణంగా పిడుగుపాటుతో బాపట్ల జిల్లాలో ఇద్దరు మృతి చెందినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. అకాల వర్షం తెచ్చిన నష్టంపై అన్నిజిల్లాల కలెక్టర్‌లతో ముఖ్యమంత్రి వీక్షణా సమావేశం నిర్వహించారు. మరో రెండురోజులు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్ని జిల్లాల కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతి ఏట ఏర్పడే విపత్తుల సమయాన్ని పరిగణనలోకి తీసుకొని అధికారులు ముందస్తుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రాణనష్టాన్ని పూర్తిగా అరికట్టటానికే ప్రవేశపెట్టిన వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికార యంత్రాంగం మానవతా దృక్పధంతో పని చేయాలన్నారు. అనేక ప్రాంతాలలో విద్యుత్ పునరుద్దరణ కార్యక్రమం సమర్ధంగా చేపట్టాలన్నారు. అకాల వర్షం దాటికి జిల్లాలో 6 పశువులు మృతి చెందాయని కలెక్టర్ వివరించారు. కేవలం మూడు మండలాలలో మాత్రమే 77 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, మిగిలిన ప్రాంతాలలో వర్షం పడలేదన్నారు. వ్యవసాయ పంటలన్నిటికి కోతలు పూర్తయ్యాయని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు ఉద్యాన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలన చేయాలని తహసీల్దార్‌లను ఆదేశించామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై కొలువుతీరిన భావదేవుడు

● ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంపై భావదేవుని ఊరేగించారు. ఉదయం ధ్వజారోహణ ఆస్థానోత్సవం దేశిరాజు వెంకటరమణబాబు, వసుంధరలక్ష్మీలు జరిపారు. అనంతరం భావదేవుడిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి ఊరేగింపు చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, పండితులు మూర్తి, పాంచజన్యం, భార్గవ్, సత్యంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.శేషకృష్ణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభవాహనంపై ఊరేగుతున్న భావదేవుడు, ఉత్సవంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

ఘనంగా శ్రీబగళాముఖి అమ్మవారి జయంతి



ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి జయంతిని భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. శ్రీ బగళాముఖి అమ్మవారికి 108 కలశాలతో, వివిధ సుగంధ ద్రవ్యాలతో మహిళలతో సామూహిక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని నిజరూప శ్రీబగళాముఖిగా అలంకరణ గావించారు. హారతి, మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన తెల్లబాటి శ్రీనివాసరావు, కనకదుర్గ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారని జి.నరసింహమూర్తి తెలిపారు. శ్రీబగళాముఖి అమ్మవారి జయంతి మహోత్సవాలు సందర్భంగా మండలంలోని వివిధప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకొని అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



కలెక్టర్ జె.వెంకటమురళికి సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు

రైతుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం, తడిచి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి వచ్చి కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన ధాన్యం పొలాలలో నిల్వ ఉన్నాయని, వాటిని వెంటనే రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేసి రైతుకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ డి.సీతారామిరెడ్డి, కర్లపాలెం మండల ఉపాధ్యక్షుడు సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు యర్రావుల ఏడుకొండలు, అట్ల నాగేశ్వరరెడ్డి, నాని, అమీర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే పని చేస్తున్న ప్రభుత్వాలు

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు బడా కార్పొరేట్లు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయని, శ్రామికులు, చిరువ్యాపారుల ఆకలి, ఆర్థిక, అప్పుల సమస్యలు పట్టించుకోవని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి కొల్లా వెంకయ్య కాలనీలో సోమవారం కార్ల్‌మార్క్స్ 207వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంతగా ఏకీకృతమైందని, వనరుల పంపిణీ విషయంలో ప్రభుత్వాల నుంచి కార్పొరేట్ శక్తులు లాగేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం బాపట్ల డివిజన్ అధ్యక్షులు ఎస్‌కే అజిత, హాఫీజుల్లా, వెంకాయమ్మ, నాగూర్‌బీ, మస్తానీ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె మెయిన్ డ్రెయిన్ కాల్వ పూడిక తీయించాలి

● చెరుకుపల్లి, వేమూరు మండలాల రైతులు

బాపట్ల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె మెయిన్ కాల్వ పూర్తి స్థాయిలో పూడిక తీసి కాల్వ సామర్థ్యంను పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు అమర్తలూరు, చెరుకుపల్లి, నగరం, భట్టిప్రోలు, వేమూరు మండలాల పరిధిలోని రైతులు వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో రైతులు విలేకర్లతో మాట్లాడుతూ 30 సంవత్సరాలు నుంచిమురుగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, గత సంవత్సరం ఖరీఫ్‌సీజన్‌లో కురిసిన భారీవర్షాలు కారణంగా వరి పంట పూర్తిగా నష్టపోయామన్నారు. 2025-2026 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు సదరు కాల్వను పూర్తి స్థాయిలో పూడిక తీసి కాల్వ సామర్థ్యంను పెంచి ముంపును నివారించాల్సిందిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు మేకా మహేష్, గోగినేని బాలకోటేశ్వరరావు, గడ్డిపాటి రాఘవేంద్రరావు, నాగకోటి వెంకటరమణఉన్నారు.

సీసీపై విచారణకు ఆదేశం

కర్లపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డ్వాక్రా మహిళలను కించపరుస్తూ అసభ్యంగా మాట్లాడుతున్న సీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కొంతమంది సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

● ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగు, సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పెద్దఎత్తున వచ్చి తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు ఆక్రమణలకు గురవుతున్నట్లు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో పెద్దఎత్తున అర్జీలు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో సాగునీటి, తాగునీటి చెరువులు అన్యాక్రాంతం కాకుండా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీశాఖాధికారులు, సర్వేశాఖాధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలన్నారు. నీటి తీరువా వారం రోజుల్లో నూరుశాతం పూర్తి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో గృహనిర్మాణశాఖ ద్వారా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు తహసీల్దార్‌లు వెంటనే ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో పి4 పథకాన్ని అమలు చేయటానికి ప్రతి మండలానికి 200 మంది మార్గదర్శకులని, మున్సిపాలిటిలో 500 మందిని ఎంపిక చేయాలన్నారు. బంగారు కుటుంబాలను 10 చొప్పున అధికారులు దత్తత చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, గృహనిర్మాణశాఖాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఎనిమిది అర్జీలు అందాయి. ఏఐటీయూసీ నాయకులు కార్మికులకు నెలసరి వేతనం రూ.35వేలు ఇవ్వాలని అర్జీ దాఖలు చేశారు. పట్టణంలోని 1వవార్డుకు చెందిన బొలిశెట్టి ఆదిలక్ష్మి ఏ బ్యాంకులో డ్వాక్రా రుణం తీసుకోలేదని బ్యాంకు వారు లోను కట్టాలని నోటీస్ ఇచ్చారని పరిశీలించి తగున్యాయం చేయాలని కోరారు. మండలంలోని నల్లూరుపాలేనికి చెందిన భీమనేని హనుమంతరావు పంచాయతీ రోడ్డు తన ఇంటి వరకు రాకుండా 25 గజాల దూరంలోనే నిర్మాణం నిలిపివేశారని, ఇంటి వరకు రహదారి వచ్చేలా చూడాలని కోరారు. ఉప్పూడి గ్రామానికి చెందిన గుజ్జర్లమూడి క్రిస్టిఫర్, డేవిడ్, సంజీవ్‌రావులు సర్వేనెం.163/4లో 25 సెంట్లు సర్వేనెం.163/1లో 125సెంట్లు, ఆ భూమిని సర్వే చేసి సర్టిఫికెట్, 1బీ, అడంగల్ మంజూరు చేయాలని కోరారు. ఉప్పూడి గ్రామానికి చెందిన సబ్బినేని సత్యనారాయణ సర్వేనెం.336/2, 36/3లో గల భూమిని సర్వే చేయించాల్సిందిగా అర్జీ దాఖలు చేశారు. ఉప్పూడికి చెందిన వేమూరి శ్రీనివాసరావు సర్వేనెం.394/2బిలో య.2.02 సెంట్ల భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయా ల్సిందిగా కోరారు. పోతార్లంక గ్రామానికి చెందిన ఆలూరి మల్లేశ్వరి తన ఇంటి నివేశనస్థలం ఆక్రమణకు గురైందని, ఆక్రమణను తొలగించాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని పరిశీలించి ఆయా అధికారులకు తెలిపి పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

విద్యారంగంలో అశాస్త్రీయ విధానాలను విడనాడాలి



తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఆశాస్త్రీయ విధానాలను విడనాడాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో 117 జీవో రద్దు ప్రధాన అంశంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో రద్దు చేశారే గాని మెరుగైన పాఠశాల వ్యవస్థ, శాస్త్రీయమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగలేదన్నారు. గత ప్రభుత్వం పాఠశాల స్వరూపాన్ని అక్షరాలుగా విభజిస్తే కూటమి ప్రభుత్వం పాఠశాల స్వరూపాన్ని 9రకాలుగా విభజించి విద్యావ్యవస్థకు తీవ్ర నష్టాన్ని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, నాయకులు మురళి, నారాయణ, ప్రసాద్, బాలాజి, కత్తి శ్రీనివాసరావు, బి.నాగాంజనేయులు, చక్రపాణి, విజయబాబు, జ్వాలరావు, రమణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, దుర్గారావు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్.సలీమాకు వినతిపత్రం అందజేశారు

రేపల్లెలో...

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : బేసిక్ పాఠశాలను యదాతథంగా కొనసాగించి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కాపాడాలని, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి అన్ని పాఠశాలల్లో ఒకేరకంగా అమలు చేయాలని ఏపీటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా రేప ల్లె పాత తాలూకా కేంద్రం నుంచి ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగేకొద్ది ఉపాధ్యాయుల సంఖ్యను పెంచుకుంటూ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంసీహెచ్ రాజారత్నం, వై.నీతాంజనేయప్రసాద్, తేలప్రోలు శ్రీనివాసరావు, వై.చెన్నకేశవులు, సీహెచ్ శ్రీనివాస్, ఎం.రాంబాబు, లక్ష్మీనారాయణ, కె.కిరణ్, ఎన్‌వీవీ సత్యనారాయణ, టి.మల్లికార్జున్‌రావు, యాకోబ్ పాల్గొన్నారు..

రథోత్సవం నాటికి నూతన రథం పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● అదనపు ఖర్చు తానే పెట్టుకుంటానన్న ఎమ్మెల్యే

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : భక్తుల మనోభావాలకు అనుగుణంగా భావదేవుని నూతన రథ నిర్మాణం రథోత్సవం నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆయన నూతన రథ నిర్మాణ పనులను పరిశీలించారు. రథానికి ఉపయోగించే మోకు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రథం మార్పులు, చేర్పులకు అయ్యే అదనపు ఖర్చు తానే భరిస్తానని చెప్పారు. నిర్మాణం గురించి అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ శిల్పి మోహన్, కాంట్రాక్టర్ దాసరి కృష్ణ, టీటీడీ ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.శేష కృష్ణ, టీడీపీ నాయకుడు మందపాటి అంద్రేయ, పండితులు మూర్తి, పాంచజన్య, భార్గవ్, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతన రథ నిర్మాణంలో మార్పులు, చేర్పులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఎస్‌ఐను అభినందించిన టీడీపీ నేతలు

పిట్టలవానిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటశివకుమార్‌ను మండల టీడీపీ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు సమక్షంలో సోమవారం మర్యాదపూర్వకంగా మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, పార్టీ నాయకులు కలిసి అభినందించారు. ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్మా జాన్‌బాబు, బర్మా శామ్యూల్, బర్మా చంటిబాబు, బర్మా బుల్లియ్య, చందోలు రవి, వడ్లమూడి పండుబాబు, నిఖిల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా, కోయలకొండ మండలం, చంద్రాసుపల్లి గ్రామానికి చెందిన వడ్డే ఆంజనేయులు (22) మరికొందరితో పాటు ఇటీవల కొల్లూరు మండలంలో గొర్రెలు మేపుకునేందుకు వలస వచ్చాడు. ఆదివారం క్రాప అడ్డరోడ్డు సమీపంలోని పొలాల్లో గొర్రెలను కాస్తు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా అదే సమయంలో వర్షంతో పాటు పిడుగుపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరులోని సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించటంలేదని తల్లి ఫిర్యాదు

బాపట్ల,మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 10వవార్డు ఫ్యాడిసన్‌పేటకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించటంలేదని తల్లి మాసిపోగు నాగమణి ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఏఎస్‌ఐ బ్రహ్మం తెలిపారు.

జీవో 77 రద్దు చేయకుండా పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటాం

● ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పవన్‌కుమార్

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవోనెంబరు 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పవన్‌కుమార్ అన్నారు. ఈ విషయమై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన జీవో నెంబరు 77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. జీవోను రద్దు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, చైతన్య, పవన్‌పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ సేవలకు అభినందనలు

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సాయం చేస్తున్న అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. పట్టణలోని ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న డ్రైవర్ షబ్బీర్ కొంత కాలంగా కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకొని ఆర్గనైజేషన్ సభ్యుల సహకారంతో సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండపాటూరు అనీల్‌కుమార్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, ఉప్పాల మురళి, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

తాండ్ర సాంబశివరావుకు ఘన సత్కారం

కర్లపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు సమర్థవంతమైన ప్రజా ప్రతినిధిగా రాణిస్తున్నారని కర్లపాలెం-2 ఎంపీటీసీ షేక్ ఆసిస్, చింతాయపాలెం ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణ అన్నారు. తాండ్ర సాంబశివరావును సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ జాతీయసమితి ఇచ్చిన దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ కార్మికులు ధర్నా నిర్వహించారు. రేపల్లె సీపీఐ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి కార్మికులను కట్టుబానిసలను చేయటంతో పాటు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. అనంతరం ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.కుసుమకుమారి, సిరంశెట్టి శ్రీనివాసరావు, చుక్కాకుల శివశంకర్, ముత్యాల వెంకటేశ్వర్లు, రమణ, దుర్గారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరమ్మ మృతిపై దర్యాప్తు చేయాలి

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మెడికల్ హెల్త్ సెక్రటరీగా పనిచేస్తున్న కోటేశ్వరమ్మ పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య, అనుమానాస్పద మృతిగా వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు చేయించి మహిళలకు రక్షణ కల్పించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.శ్యామ్ అన్నారు. 5వ వార్డులో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరమ్మ పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుందని దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని ఆర్డీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ విజయేంద్రరావుకు ఏఎన్‌ఎంలు, సీఐటీయూ నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు హెల్త్, సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణ్‌రావు, డి.ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి : ఎస్పీ

బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 51 మంది తమ సమస్యలను అర్జీల ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళారు. ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోగా చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలన్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, అత్తారింటివేధింపులు, భూవివాదాలు, ఇతర సమస్యలు అర్జీల ద్వారా వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్‌ఎస్ సెల్ ఎస్‌ఐ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బౌద్ధ స్థూపాన్ని పరిశీలించిన ఆర్డీవో

● అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని సూచన

భట్టిప్రోలు (కొల్లూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ స్థూపాన్ని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సందర్శించారు. భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, మే 12వ తేదీన బుద్ధ జయంతి వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలని ఇటీవల గ్రీవెన్స్‌లో దళిత బుద్ధిస్టులు కలెక్టర్ కె.వెంకటమురళికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఆర్డీవో, జిల్లా పంచాయతీ అధికారి బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక అందించాలని సూచించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో అక్కడ చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. 12న బుద్ధ జయంతి నిర్వహించాలని బుద్ధిస్టులు కోరగా, కలెక్టర్‌తో చర్చించి వేడుకల నిర్వహణపై ప్రకటన చేస్తామని ఆర్డీవో అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్మయి, ఆది ఆంధ్ర నవ బుద్ధిస్టు సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది దోవ రమేష్ రాంజీ, టీడీపీ నాయకులు నీల జోగిబాబు, న్యాయవాది సాంబశివరావు, కోటయ్య, యన్నం సురేష్, పేర్లి మోజెస్, దళిత నాయకులు వినయరాజు, రవీంద్రబాబు, తురిమెళ్ల శ్యాం పాల్గొన్నారు.



బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

శివాలయ పునఃప్రతిష్ఠకు కంచి పీఠాధిపతుల దివ్య ఆశీస్సులు

● యంత్రాలు స్పృశించి మంగళా శాసనాలు అందజేత



యంత్రాలను స్పృశించి మంగళా శాసనాలు తెలియజేస్తున్న కంచి పీఠాధిపతి సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి

వేమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో పునర్నిర్మితమైన శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ ఉదయం జరగనుంది. ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆగమ శాస్త్ర ప్రకారం ప్రధానంగా యంత్రస్థాపన జరగనుంది. ఆలయంలో పలు విగ్రహాలు, శిఖరాలు, జీవధ్వజం ప్రతిష్ఠలు జరపనున్నారు. ఇందుకు సంబంధించిన యంత్రాలను శైవాగమ ప్రతిష్ఠాపన ఆచార్య బ్రహ్మశ్రీ పొత్తూరు సత్యనాగ మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో తిరుపతిలోని శంకరమఠానికి తీసుకువెళ్లారు. ఆదివారం మఠానికి విచ్చేసిన శంకర విజయేంద్ర సరస్వతి స్వామి 71వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామీజీలు యంత్రాలను నిత్య అనుష్ఠాన పూజలో ఉంచి అనంతరం పండిత మృత్యుంజయ శర్మ ద్వారా ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ గాజుల వెంకటసుబ్బయ్యకు అందజేశారు. సోమవారం యంత్రాలను ప్రతిష్ఠ జరుగనున్న ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమశాలలో ఉంచి పండితులు అనుష్ఠాన జపాలను ప్రారంభించారు.

వైభవంగా వాసవీ అమ్మవారి జయంతి

భట్టిప్రోలు (కొల్లూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు సోమవారం ప్రారంభించారు. భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆలయంలో రుద్ర చండీ హోమం నిర్వహించారు. హోమ పూజలో 33 మంది దంపతులు పాల్గొన్నారు. పూజాది కార్యక్రమాలను జానపాటి లీలావేణుగోపాలశర్మ బృందంచే నిర్వహించారు. హోమంలో పాల్గొన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా వాసవీ అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, మహిళా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కొల్లూరు మండలంలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేమూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : బెల్టు షాపుల నియంత్రణకు ఎక్సైజ్ అధికారులు పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. సోమవారం వేమూరు ఎక్సైజ్ పరిధిలోని కొల్లూరు మండలంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని అందిన సమాచారంతో ఆకస్మిక దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. వివిధ గ్రామాల్లో అనుమానిత దుకాణాలతో పాటు పరిసరాలను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. అలాగే లైసెన్స్ మద్యం దుకాణాల పరిసరాలలో మద్యం సేవిస్తున్నారా లేదా అనే అంశంపై కూడా తనిఖీ చేయడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు నిర్వహించుకోవాలని వ్యాపారులకు సూచించారు. నూతన మద్యం పాలసీ ప్రారంభం నాటి నుంచి తమ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం, బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. దాడుల్లో ఎస్‌ఐ శ్రీరామ్‌శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవ ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యత : ప్రిన్సిపాల్

నగరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సామాజికసేవ ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యత అని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. సోమవారం నగరంలో బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ ఎన్‌సీసీ క్యాడెట్స్ ద్వారా కూలింగ్ వాటర్ సప్లయ్ చేయటం, క్యాప్స్, ద్విచక్ర వాహనదారులు దూర ప్రదేశాలకు వెళ్తున్నప్పుడు హెల్మెట్స్ ధరించమని ప్లేకార్డ్స్ ద్వారా ప్రజలకు తెలియజేయడం, అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరాన్ని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు తెలియజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ సామాజికపరమైన కార్యక్రమాలను మరిన్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ వి.సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

● వ్యవసాయ మోటార్ ఆన్ చేస్తుండగా ఘటన

బల్లికురవ. మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కౌలురైతు సురభి నాగేశ్వరరావు(49) మృతిచెందిన ఘటన మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు సురభి నాగేశ్వరరావు ఎస్ఎల్ గుడిపాడు గ్రామ పరిధిలోని పంటపొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం రోజుమాదిరిగానే పంటపొలంలో విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందు కు ప్రయత్నించాడు. దీంతో ప్రమాదవశాత్తు తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో రైతుకు తీవ్రగాయాలై కిందపడ్డాడు. వెంటనే పక్క పొలాలోని రైతులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న నాగేశ్వరరావును ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ పోషణ కోసం వేరే గ్రామంలో పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగుచేస్తూ, విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందడంతో కూకట్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వరరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు బల్లికురవ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వీరవల్లి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యశాలలో ఉన్న మృతదేహానికి పోస్టు మార్టం చేయించి వారి బంధువులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

చెన్నుపల్లిలో యువకుడి ఆత్మహత్య

బల్లికురవ. మే 5 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్ షరిప్(22) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పక్కనే కొమ్మాలపాడు గ్రామానికి వెళ్లి అక్కడ ఒక తాడు కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చే మార్గమధ్యంలో చెన్నుపల్లి గ్రామ సమీపంలో వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సోమవారం యువకుడి మృతదేహానికి వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



పేర్లి ప్రకాశరావు (ఫైల్)

తోటవారిపాలెం(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనిచేస్తూ గుండెపోటుతో కూలి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామంలో చోటుచుసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేర్లి ప్రకాశరావు(54) ఎప్పటిలాగే సోమవారం ఉదయం కాలువలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు వెళ్లాడు. అయితే కొద్దిసేపు పని అనంతరం అలసటగా ఉండడంతో గట్టుకు ఆనుకుని కుప్ప కూలాడు. ఫీల్డ్ అసిస్టెంట్ పాపన సుజాత, కూలీల సహాయంతో ఆయన్ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై ఉపాధి కార్యాలయ సిబ్బంది వివరాలు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, వివాహమయిన కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మార్టూరు, మే5(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రదేశాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో చోటుచేసుకొంది. వాటిలో చిలకలూరిపేట వైపు వెళ్లే రోడ్డులో ఎలవర్తి కోల్డ్‌స్టోరేజీ సమీపంలో మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్లమూడి కాలేషా పల్సర్ బైక్ పై పేట వైపు వెళుతుండగా,వెనుకవైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది.ఈ ప్రమాదంలో బైక్ పై నుండి రోడ్డుపై పడిపోయిన కాలేషా తలకు గాయమయ్యింది.దాంతో అతనిని 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రి కి తరలించారు.అదేవిధంగా కోనంకి నుండి ఇసుకదర్శి రోడ్డుకు రాంగ్ రూట్ లో స్కూటీపై వెళుతున్న కామేపల్లి జయకృష్ణ వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా అతనితలకు గాయాలయ్యాయి.జె పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన అతనిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు ఎడ్లజత మృతి

● ఒక ఇంటి మెట్లు, చెట్లు ధ్వంసం



మృతిచెందిన ఎడ్లజత

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆదివారం కురిసిన భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంబీభత్సం సృష్టించింది. ఈక్రమంలో పలుచోట్ల పొలాల్లో, చెట్లుపై, ఇంటిపై పిడుగులు పడ్డాయి. మండలంలోని పాత చీరాల గ్రామానికి చెందిన పిట్టు నాగరాజు ఎడ్లబండితో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఇంటి సమీపంలో చెట్టుకు కట్టేసిన రెండు ఎడ్లుపై పిడుగు పడింది. దీంతో రెండు మూగజీవాలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటాయని యజమాని తెలిపాడు. ప్రాణం కోల్పోయి చెట్టు కింద పడి ఉన్న ఎడ్ల కళేబరాలను చూసి యజమాని దంపతులు విలపించారు. అలాగే వేటపాలెం పరిధిలోని వడ్డె సంఘం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన శ్రీనివాసరావు ఇంటి మెట్లుపై పిడుగు పడి మెట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ఉజిలీపేటకు చెందిన మరో మహిళకు చెందిన గేదె పొలాల్లో ఉండగానే పిడుగు మృతి చెందింది. ఈక్రమంలో చోటుచేసుకున్న వరుస ఘటనలతో ప్రజలు బీతిల్లి పోయారు. పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ బాక్సు సైతం పల్టీలు కొడుతూ రోడ్డుకు అడ్డంగా చేరింది.

మధ్యవర్తిత్వానికి వెళ్లిన వ్యక్తిపై దాడి



తీవ్రంగా గాయపడ్డ నాగరాజు

అద్దంకి, మేౕ5 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీలో చిన్న విషయమై యువకుల మధ్య సోమవారం గొడవ జరగగా గాలేటి నాగరాజు మధ్యవర్తిత్వానికి వెళ్లాడు. దీంతో వారిలో కొంతమంది యువకులు నాగరాజుపై దాడి చేశారు. గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యం చేయించుకోకుండా నాగరాజు హడావుడి చేస్తుండడంతో అటువైపుగా వెళ్తున్న సీఐ సుబ్బరాజు వైద్యశాలకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వైద్యం చేయించారు.

నాగులపాలెంలో గడ్డివామి దగ్ధం

● రూ.2 లక్షలకు పైగా ఆస్థినష్టం



మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

నాగులపాలెం(పర్చూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : గడ్డివామి దగ్ధమైన ఘటన మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాధినేని సాంబయ్యకు చెందిన గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. గడ్డివామి అగ్ని ప్రమాదానికి గురికావడంతో స్థానికులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈప్రమాదంలో రూ.2లక్షలకు పైగా ఆస్థినష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

వలస కార్మికులపై ఏదీ నిఘా?

● మార్టూరు ప్రాంతంలో 8 వేలకు పైగా ఇతర రాష్ట్రాల కార్మికులు ● పర్యవేక్షించని పోలీసులు, యజమానులు



గ్రానైట్ పరిశ్రమలో పనిచేసేందుకు వస్తున్న రాజస్థాన్ యువకులు

మార్టూరు, మేౕ5 (ఆంధ్రజ్యోతి): మార్టూరు ప్రాంతంలో ఉన్న గ్రానైట్ వ్యాపారం ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులపైనే ఆధారపడి ఉంటుంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కార్మికులు రాకపోతే మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమలు లోని యంత్రాలు కదలవు. వారు పనిచేయని గ్రానైట్ పరిశ్రమ లేదంటే అతిశయోక్తికాదు.

స్థానికంగా ఉన్న కార్మికులు గ్రానైట్ పరిశ్రమలో పనిచేయలేరు. దీంతో ప్రతి గ్రానైట్ పరిశ్రమ యజమాని కనీసం 15 నుండి 20 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులపైనే ఆధారపడతారు. వారిలో అత్యధికంగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారుకాగా, ఒడిషా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన వారు గ్రానైట్ కూలీలుగా ఈ ప్రాంతంలో పనిచేస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమలతో పాటు కంకరమిల్లులు, స్పిన్నింగ్ మిల్లులో మరి కొంత మంది పనిచేస్తున్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు 200కు పైగానే ఉన్నాయి. దాదాపుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 8 వేల మందికి పైగానే ఈ ప్రాంతంలో వివిధ గ్రానైట్ పరిశ్రమలు, గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రతి వారంలో ఎంతో కొంతమంది వస్తుంటారు మరికొంతమంది ఇక్కడనుండి వెళ్లిపోతుంటారు. అమావాస్య రోజు మాత్రం రాజస్థాన్ కార్మికులు పనిచేయరు. దీంతో గ్రానైట్ పరిశ్రమలకు కూడా యజమానులు సెలవు ప్రకటిస్తారు.

కొరవడిన నిఘా

ఇతర రాష్ట్రాల గ్రానైట్ కార్మికులపై ఇక్కడ నిఘా పెద్దగా ఉండదు. ముఖ్యంగా గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కూలీలపై పర్యవేక్షణ పెద్దగా ఉండదు. వాస్తవంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు గంజాయి, గుట్కాలకు, అలవాటుపడిన వారు చాలా మంది ఉన్నారు. కార్మికుల మాటున నేరచరిత్ర ఉన్న వారు ఇక్కడికి వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో కార్మికుల రాకపోకలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఏ గ్రానైట్ పరిశ్రమలలో ఎంత మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కార్మికులుగా పనిచేస్తున్నారనే వివరాలపై పోలీసులు పర్యవేక్షణ చేయాల్సిన అవశ్యకత ఉంది. అంతేగాకుండా మార్టూరు కూడలిలో లారీబ్రోకర్ కార్యాలయాలు, కూడా కొంతమంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నిర్వహిస్తున్నారు. వారిలో కొంతమందికి గ్రానైట్ అక్రమ రవాణాచేసే యువకులతో సంబంధాలు ఉన్నాయి. కార్యాలయాలకు ఎవరు వస్తున్నారు, వారు వాస్తవంగా లారీలను సప్లయ్ చేస్తున్నారా, ఇంకా ఏమైనా అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారా..? అనే విషయంపై పూర్తిస్థాయి అవగాహన స్థానిక అధికారులకు ఉండాల్సిన అవసరం ఉంది. మార్టూరు కూడలిలో కొత్తయువకులు ఎవరు కనబడినా వారు ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన గ్రానైట్ కార్మికులే అని ప్రజానీకం భావిస్తున్నారు. మరి వారు గ్రానైట్ పనికే వచ్చారా..? లేదా..? అనే విషయంపై సంబంధిత అధికారులు నిఘా పెట్టవలసిన అవసరం ఉంది. అదేవిధంగా గ్రానైట్ పరిశ్రమలలో, లేదా ఇతరత్రా చోట పనిచేసే ఇతర రాష్ట్ర కార్మికులకు గుర్తింపుకార్డులను ఇవ్వాలని గతంలో చర్చకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఆ దిశగా పోలీసుశాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఎప్పుడు ఉంటారో,ఎప్పుడు వెళతారో తెలియదు



గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలనే ఆలోచన మంచిదే. అయితే వారు ఎప్పుడు పనిచేస్తారో..? ఎంతకాలం ఉంటారో..? ఎపుడు వెళతారో..? మాకే అర్థంకాని పరిస్థితి. ఇంతవరకు రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమలో పనిచేసేవారికి గుర్తింపు కార్డులను ఇవ్వలేదు. అయినా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తాం.

సురేష్ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

వలస కార్మికులపై నిఘా పెడతాం



మార్టూరు ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఇతర పనులు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులపై పోలీసు నిఘా తప్పనిసరిగా ఉంటుంది. గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మాట్లాడి వారి పరిశ్రమలలో పనిచేసే వారి సమాచారాలు సేకరిస్తాం

ఎం.శేషగిరిరావు సీఐ మార్టూరు

పొలాల్లోకి మురుగురాకుండా నివారించాలి

ఆర్‌డీవోకు సమస్యను వివరించిన మాజీ మంత్రి పాలేటి రామారావు



వినతిపత్రం ఇస్తున్న రైతులు, మజీ మంత్రి పాలేటి

చీరాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువల్లో మురుగునీరు చేరి రైతులు నష్టపోతున్నారని మున్సిపల్ అధికారులు ఎస్‌టీపీ ప్లాంట్ పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి డా.పాలేటి రామారావు కోరారు. సోమవారం రైతులతో కలిసి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలేటి మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని వ్యర్థజలాలు దండుబాటలో నుంచి విజయనగర్ కాలనీ వద్ద ఉన్న ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువలోకి చేరుతున్నట్లు చెప్పారు. తద్వారా గవినివారిపాలెం, అక్కయ్యపాలెం ఎత్తిపోతల పథకాల్లోకి మురుగు నీరు చేరి పంటలు దెబ్బతింటున్నట్లు చెప్పారు. ఈక్రమంలో గతంలో ప్రభుత్వం ఆ ప్రాంతంలో మురుగు నీటిని శుద్ధిచేసే విధంగా సుమారు రూ.8 కోట్లుతో తలపెట్టిన ఎస్‌టీపీ ప్లాంట్(సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణం త్వరితగతిగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

మనమిత్ర వాట్సప్ సేవలో అద్దంకి భేష్



సేవల గురించి వివరిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, మే5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ సేవలకు సంబంధించి మనమిత్ర వాట్సాప్ గవర్నెస్ సేవలు అమలులోకి తీసుకొచ్చింది. అయితే కొంతమేర అమలులో ఉన్నా ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. అయితే అద్దంకి డివిజన్ విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఒక అడుగు ముందుకు వేసి మన మిత్ర వాట్సాప్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించి సంబంధిత వినియోగ దారునికి నేరుగా వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. దీంతో మధ్యలో అధికారులు, సిబ్బంది ప్రమేయం లేకుండా పారదర్శకంగా పనులు చకచకా సాగిపోతున్నాయి. నెల రోజుల వ్యవధిలో 38 అర్జీలు మన మిత్ర వాట్సాప్ ద్వారా రాగా అన్నింటిని పరిష్కరించినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వీటిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు 10, వినియోగదారుడు ఖర్చు భరించే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు 3, అదనపులోడు కోసం 8, వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు 17(62 మంది రైతులు) అర్జీలు రాగా పరిష్కరించినట్లు తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగ దారులు గతంలో వలే అధికా రులు, సిబ్బంది చుట్టూ తిరిగే శ్రమ, వ్యయం కూడా తప్పినట్లు అయ్యింది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడం తో విద్యుత్‌శాఖ అధికారులు మిగిలిన ప్రాంతాల కంటే ముందే పారదర్శకంగా, వేగవంతంగా పనులు చేయాలనే తలంపుతో అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారు. అదేసమయంలో విద్యుత్ వినియోగదారులలో చైతన్యం తీసుకు వచ్చే విధంగా అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కూడా కల్పిస్తున్నారు.

వీళ్లు మారరా..?



ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఐదుగురు మైనర్లు

సాల్మన్ సెంటర్(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిసర ప్రాంతాల్లో మైనర్‌లు హద్దులు దాటుతున్నారు. ఒకవైపు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు చవిచూస్తున్న వారిలో భయం, బాధ్యత కలుగడం లేదు. ఆదివారం జాండ్రపేట సమీపంలో ఓ మైనర్ రోడ్డు ప్రమాదంలో అసువులు బాశాడు. ఈక్రమంలో ఆ కుటుంబం బోరున విలపిస్తోంది. రెండోరోజే ఆ సమీపంలోనే బేర్ హాస్పిటల్ ఎదురుగా ఒక్క ద్విచక్ర వాహనంపై ఐదుగురు మైనర్‌లు దర్జాగా ప్రయాణం చేస్తున్నారు. ఈ ఘటన 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. వీరిపట్ల ఇంట్లో పెద్దలు కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. పోలీసులు ఒకవైపు మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, వీరు మాత్రం అధికారుల మాటలు పెడచెవిన పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కొంచెం కఠినంగా వ్యవహరించకుంటే పరిస్థితి చక్క బడేలా లేదు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు

అద్దంకి, మే 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఈఈ నల్లూరి మస్తానరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని 3వ వార్డు పరిధిలో కొత్త నంబూరివారిపాలెం, కాటికాపురుల కాలనీలలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు, విద్యుత్‌లైన్లను సోమవారం ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పరిశీలించారు. నంబూరివారిపాలెంలో ఇటీవల అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవికుమార్ దృష్టికి స్థానికులు విద్యుత్ సమస్యలను తీసుకొచ్చారు. వెంటనే విద్యుత్‌స్తంభాలను మార్పు చేసి కొత్తలైన్లను ఏర్పాటు చేయాలని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులను మంత్రి రవికుమార్ ఆదేశించారు. సుమారు రూ.20 లక్షలతో కొత్త నంబూరివారిపాలెం, కాటికాపరుల కాలనీలలో 45 విద్యుత్ స్తంభాలు, విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఆయా ప్రాంతాలలో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పరిశీలించి స్థానికులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుమారు 4 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో ఇప్పటి వరకు ఇబ్బంది పడ్డామని, కొత్త లైన్‌లు ఏర్పాటుతో సమస్య తీరిందని స్థానికులు అధికారుల వద్ద హర్షం వ్యక్తం చేశారు. అదనపు లోడు కోసం ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీని వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. పాత నంబూరివారిపాలెం లో మరో 15 విద్యుత్ లైన్లను కూడా త్వరలో మార్పు చేస్తామని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. డీఈ దామోదరం, లైన్‌మెన్ నరేష్, స్థానిక టీడీపీ నేతలు నాగరాజు, కోండ్రు వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రామమందిర నిర్మాణం

వేటపాలెం(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెం దత్తక్షేత్రంలో నూతనంగా నిర్మించిన రామమందిరం సోమవారం కమిటీ ప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఆర్ఐ కిరణ్ కోడూరి హాజరయ్యారు. భక్తులు ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రత్తి వెంకటసుబ్బారావు, శివప్రసాద్, మురళీకృష్ణ, రంగనాయకులు, రామకృష్ణ, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రామమందిర ప్రారంభోత్సవంలో భక్తులు, పోలేరమ్మవారు

తోటవారి పాలెం (చీరాల) : మండల పరిధిలోని తోటవారిపాలెంలో వేంచేసిన శ్రీ పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కమిటి ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏటా నిర్వహించే తిరునాళ్లకు సుమారు 10 వేల మంది హాజర వుతుంటారు. అందుకు సంబంధించి సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పొంగళ్లు నిర్వహించనున్నారు. పోలీసులు బదోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి

అద్దంకి : కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం అద్దంకి లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4-30 గంటల నుండి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీహెచ్‌పీ మండల శాఖ ఏర్పాటు



వీహెచ్‌పీ నూతన శాఖ

అద్దంకి : విశ్వహిందూ పరిషత్ అద్దంకి మండల శాఖను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివన్నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక గీతామందిరంలో నిర్వహించిన సమావేశంలో అద్దంకి మండలశాఖ అధ్యక్షుడిగా అన్నం రామానందనాథ్, ఉపాధ్యక్షుడిగా బొగ్గవరపు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుంజి గోవిందు, సహ కార్యదర్శి గా అన్నం లక్ష్మణ్‌కుమార్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, భాగవతుల సూర్యమాల కొండమాచార్యులు, ముద్దంశెట్టి సాంబశివ రావు, మందలపు లక్ష్మీనారాయణ, త్రిపురారిబొట్ల సుధాకర్ లను నియమించారు. కార్య క్రమంలో మద్దుల వెంకటేశ్వర్లు, వాసు గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల మృతిపై కలెక్టర్‌కు నివేదిక

బల్లికురవ. మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో శనివారం ఇద్దరు కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా అధికారులు వివరణ కోరగా సోమవారం ఎంపీడీవో కుసుమకుమారి నివేదికను పంపించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు రెండు గ్రామాలలో ఉపాధి కూలీలు మృతి చెందడం బాధాకరమన్నారు. కూలీలకు పనుల వద్ద తాగునీటిని ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలానే ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది ద్వారా తీసుకొని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచనలు చేశామన్నారు. కూలీలు కూడా ఎండగా ఉంటే కొద్దిసేపు పనుల వద్ద ఉన్న చెట్ల కింద సేదతీరేలా ఉంచాలని సిబ్బందికి సూచనలు చేశామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూలీలు ఎండలు తగ్గే వరకు పనులకు వెళ్లవద్దని కూలీలకు ఎంపీడీవో సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా గ్రామాలలో ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కూలీలకు ఏమైన ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో కోరారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్లుగా పలువురికి చోటు



రామాంజనేయులు, వనజ

మార్టూరు, మే5(ఆంధ్రజ్యోతి): పర్చూరు ఏఎంసీ మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా మార్టూరు మండలానికి చెందిన ముగ్గురికి స్థానం దక్కింది. కొత్తగా మార్కెట్ యార్డుకు పాలక వర్గాన్ని నియమించారు. అందులో మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన వెలగా రామాంజనేయులుకు (ఓసి) స్థానం దక్కింది. అదేవిధంగా రాజుగారిపాలెం నుంచి కొండపల్లి ధనలక్ష్మి (బీసీ), ద్రోణాదుల గ్రామం నుండి గద్దల అనిత (ఎస్సీ) లకు డైరెక్టర్లు పదవులు లభించాయి. ఇంకా యద్దనపూడి మండలంలో సూరవరపుపల్లి గ్రామానికి చెందిన తెలుగు మహిళ నాయకురాలు కోయ వనజసతీష్ (ఓసి)కు డైరెక్టర్‌గా స్థానం దక్కింది. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు సూచనలు మేరకు, మార్కెట్ యార్డు అభివృద్ధికి కీలకంగా పనిచేస్తారనే నమ్మకంతో డైరెక్టర్లు గా వారిని ఎంపికచేసినట్లు టీడీపీ శ్రేణులు తెలిపాయి. అదేవిధంగా డైరెక్టర్లుగా ఎంపికైన వారందరూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావుకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బర్లీ పొగాకు రైతులతో ముఖాముఖి

● కార్యక్రమానికి హాజరుకానున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

ఉప్పుటూరు(పర్చూరు), మే 5 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యలపై పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం 2.45 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో ఎస్.రామమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు హాజరు కానున్నట్లు తెలిపారు. పొగాకు రైతుల సమస్యపై మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలను అధికారుల సమక్షంలో స్వయంగా తెలుసుకుంటామన్నారు. నల్లబర్లీ సాగుచేసుకున్న రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటి ప్రహరీపై దూసుకుపోయిన కారు

కొత్తపేట(చీరాల), మే 5 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఓ ఇంటి ప్రహరీ గోడను కారుతో ఢీ కొట్టారు. దీంతో గోడ చాలా భాగం దెబ్బతింది. అలాగే కారు కూడా దెబ్బతింది. అయితే ఇంటి యజమాని సోమవారం ఉదయం చూసేసరికి ఈ ఘటన చోటుచేసుకోగా ప్రమాదానికి కారకులు కారును అక్కడే వదిలి పరారయినట్లు తెలిసింది. కారు తెలంగాణా రిజిస్ట్రేషన్‌కు చెంది ఉంది. అయితే ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

తహసీల్దార్‌కు ఏపీటీఎఫ్ ఉద్యోగుల వినతి

మార్టూరు, మే5 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని. కోరుతూ సోమవారం తహసీల్దార్ ప్రశాంతికి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అనుసరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం పరిస్థితులను కల్పిస్తుందని నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా ఏపీటీఎఫ్ ఉద్యోగులు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్,యస్‌కె జాన్ భాషా,జయకుమార్,యస్‌కె ఇర్షాద్,తవ్వా అమరబాబు,ప్రమీల,ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గా తమ్మన



తుమ్మన శ్రీనివాసరావు

అద్దంకి, మేౕ5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ మండల నూతన కార్యదర్శిగా అద్దంకి పట్టణానికి చెందిన తమ్మన శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామకపు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ్మన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నరసింహారావు

చినగంజాం, మే 5(ఆంధ్రజ్యోతి) : స్థానికశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ తరగతులను సోమవారం వినోదాత్మకంగా నిర్వహించారు. విద్యార్థులు ఆలోచనా శక్తి పెంచుకుటూ తమలో దాగిన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్, ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు అన్నారు. శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో వర్డ్‌గేమ్‌ను ఆంగ్ల ఉపాధ్యాయులు, కంప్యూటర్ శిక్షణలో భాగంగా వార్డ్ పెయింట్ ఎలా ఉపయోగించాలో రిసోర్స్‌పర్సన్ వై.రామాంజనేయులు వివరించారు. కథలు, కథనాలు సృజనాత్మకృతాల్లో భాగంగా కథలు చదవడం, దేశభక్తి గీతాల ఆలాపన కార్యక్రయాన్ని మరో రిసోర్స్ పర్సన్ పి.శ్రీనివాసరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.